


సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 339

గురువారం 29-2-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




### భారత్‌లో బిల్ గేట్స్

టెక్ దిగ్గజం బిల్‌గేట్స్ హైదరాబాద్‌లోని ఐడీసీని సందర్శించారు. - 13లో



### తొలి మహిళా క్యూరేటర్

విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో పిచ్ క్యూరేటర్‌గా జసింత ప్రేక్షకులను ఆకర్షిస్తోంది. - 11లో



### అఖిలేశ్‌ను ప్రశ్నించనున్న సీబీఐ

యూపీలో అక్రమ గనుల కేటాయింపుల కేసుల్లో విచారణకు రావాలని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్‌ను సీబీఐ ఆదేశించింది.
- వివరాలు 6లో




### మాతృత్వానికి దూరం.. దూరం!

దక్షిణ కొరియాలో చాలామంది మహిళలు పిల్లల్ని కనడం లేదు. మాతృత్వానికి దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంటున్నారు.
- వివరాలు 6లో



### అమెరికాలో కార్చిచ్చు..

టెక్సాస్ రాష్ట్రంలో కార్చిచ్చు చెలరేగింది. లక్షల ఎకరాలు ఆహుతయ్యాయి. టెక్సాస్ చరిత్రలో అతిపెద్ద కార్చిచ్చు ఘటనల్లో ఇది ఐదోది.
- వివరాలు 6లో



### టార్గెట్ హిమాచల్?

హిమాచల్‌ప్రదేశ్ రాజకీయ పరిణామాలు రసకందాయంలో పడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడపై సందేహాలు మొదలయ్యాయి.
- వివరాలు 6లో

## నేడు కొత్త డీఎస్సీ నోటిఫికేషన్!

- కొత్తగా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో గతంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు పాఠశాల విద్య కమిషనర్ దేవసేన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త నోటిఫికేషన్ గురువారం వెలువడే అవకాశం ఉందని విద్యా శాఖ వర్గాలు వెల్లడించాయి. - 2లో

## దమ్ముంటే 17 ఎంపీ సీట్లు గెలిపించుకోవాలి

- వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాల్లో ఎంపీలను గెలిపించుకుని మగతనం నిరూపించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సీఎం మాట్లాడే తీరు సరిగా లేదని ధ్వజమెత్తారు. - 3లో

## పక్కా నిఘా.. పటిష్ట బందోబస్తు

- ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది పరీక్ష రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం ప్రశాంతంగా జరిగింది. తొలి రోజు ద్వితీయ భాష పేపర్–1 పరీక్ష నిర్వహించారు. 4,88,113 మంది హాజరయ్యారు. 19,641 మంది వివిధ కారణాలతో పరీక్ష రాయలేదు. - 14లో

# మెగా హెచ్ఎండీఏ!

## ఆర్ఆర్ఆర్ వరకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ విస్తరణ

### ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతాలను హెచ్ఎండీఏ పరిధిలోకి తీసుకురావాలన్న సీఎం

- రెండు రింగ్ రోడ్లను అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు
- ఓఆర్ఆర్‌లోపు ప్రాంతం, ఆర్ఆర్ఆర్ లోపు ప్రాంతం రెండు వేర్వేరు యూనిట్లుగా అభివృద్ధి ప్రణాళికలు
- సిటీతో పాటు శివారు మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత
- మాస్టర్ ప్లాన్–2050కి అనుగుణంగా విజన్ డాక్యుమెంట్‌కు రూపకల్పన
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- ఓఆర్ఆర్ టోల్ టెండర్లలో అవకతవకలపై సీబీఐ లేదా తత్సమాన సంస్థతో విచారణ జరిపిస్తామని వెల్లడి
- పురపాలక శాఖ, హెచ్ఎండీఏపై ముఖ్యమంత్రి సమీక్ష



హెచ్ఎండీఏపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)ను రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) వరకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం ఏడు జిల్లాల్లో ఏడు వేల చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న హెచ్ఎండీఏ సుమారు పదివేల చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సచివాలయంలో పురపాలక శాఖ, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి కొత్తగా రానున్న ఆర్ఆర్ఆర్ మధ్య ఉండే ప్రాంతాలను హెచ్ఎండీఏ పరిధిలోకి తీసుకుని రావాలని ఆదేశించారు. రెండు రింగ్ రోడ్లను అనుసంధానించేలా రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. ఓఆర్ఆర్ లోపు ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా, ఆర్ఆర్ఆర్ లోపు ఉన్న ప్రాంతాన్ని మరో యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన సిటీతో పాటు కొత్తగా విస్తరిస్తున్న శివారు మునిసిపాలిటీల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. మాస్టర్ ప్లాన్– 2050కి అనుగుణంగా ప్రత్యేక కన్సల్టెన్సీతో సిటీ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని ఆదేశించారు.

### ఆమ్రపాలికి 'టోల్ నివేదిక' బాధ్యత

ఓఆర్ఆర్ టోల్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని హెచ్ఎండీఏ అధికారులను సీఎం ఆదేశించారు. కనీస రేటు నిర్ణయించకుండా టెండర్లు ఎలా పిలిచారని ప్రశ్నించారు. టెండర్లలో ఏయే సంస్థలు పాల్గొన్నాయి? అవకతవకల్లో ఎవరెవరి ప్రమేయముంది? తదితర అన్ని కోణాల్లో దర్యాప్తు జరపాలని చెప్పారు. టెండర్లకు అనుసరించిన విధానాలు, ఫైళ్లు కదిలిన తీరు, జరిగిన అవకతవకలపై పూర్తి వివరాలను సమర్పించాలని హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలిని ఆదేశించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన ఫైళ్లు ఏవైనా మిస్సయినట్లు గుర్తిస్తే.. వెంటనే సంబంధిత అధికారులు, బాధ్యులైన ఉద్యోగులపై వ్యక్తిగతంగా కేసులు నమోదు చేయాలని

మిగతా 2వ పేజీలో ▶

# ఎంపీ టికెట్ ఎవరికో?



## ఏఐసీసీ పెద్దల చుట్టూ కాంగ్రెస్ నేతల ప్రదక్షిణలు


- ఇటు ఇతర పార్టీల నేతల కోసం టీపీసీసీ ఎదురుచూపులు
- మూడు, నాలుగు చోట్ల వలస నేతలకు అవకాశం
- మూడు సీట్లు బీసీలకు?
- ప్రస్తుతానికి దీపాదాస్ మున్షీ వద్ద ఆగిన బంతి
- త్వరలోనే ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ భేటీ.. ఆ తర్వాత సీఈసీ సమావేశంలో ఖరారు
- రాష్ట్రం నుంచి రాహుల్ పోటీపై పార్టీలో ఆసక్తికర చర్చ


**సాక్షి, హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కోసం అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు అటు ఢిల్లీ చుట్టూ.. ఇటు సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర టీపీసీసీ పెద్దల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇతర పార్టీల కంటే ముందే ఎంపిక ప్రక్రియ ప్రారంభించిన అధికార కాంగ్రెస్ పార్టీ టికెట్ల ఖరారు రేసులో మాత్రం కొంత వెనుకబడినట్టు కనిపిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీలు చాపకింద నీరులా తమ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో ముందుకెళుతుంటే కాంగ్రెస్‌లో మాత్రం కొంత డైలమా కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారం దక్కిన నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి పెద్ద చేపలు తమ గాలానికి చిక్కుతాయనే ఆలోచనతో పాటు పార్టీలో అంతర్గతంగా నెలకొన్న పోటీ కూడా ఇందుకు కారణమని తెలుస్తోంది. కాగా, టికెట్ల విషయమై త్వరలోనే ఢిల్లీలో జరిగే స్క్రీనింగ్ కమిటీ భేటీ తర్వాత స్పష్టత వస్తుందనీ, ఆ తర్వాత సీఈసీ సమావేశంలో ఖరారయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ కూడా వచ్చే అవకాశం ఉండటంతో సరైన సమయంలోనే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని అంటున్నారు. కాగా, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ప్రస్తుతం రాష్ట్రంలో లోక్‌సభ సీట్లకు టికెట్ల ఎంపిక, అభ్యర్థిత్వాల పరిశీలనపైనే పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరించినట్టు పార్టీ వర్గాల సమాచారం.

### కొత్త నేతలకు అవకాశమిస్తారా?

ఇటీవలే పార్టీలో చేరిన కొందరు నేతలకు లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఇస్తారనే చర్చ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఈ జాబితాలో బొంతు రామ్మోహన్ (సికింద్రాబాద్), కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి (మల్కాజ్‌గిరి), పట్నం సునీతా మహేందర్‌రెడ్డి (చేవెళ్ల), నీలం మధు ముదిరాజ్ (మెదక్), తాటికొండ రాజయ్య (వరంగల్) పేర్లు వినిపిస్తున్నాయి. సికింద్రాబాద్, చేవెళ్ల విషయంలో అభ్యర్థిత్వాలు దాదాపు ఖరారయ్యాయనే చర్చ కూడా

మిగతా 2వ పేజీలో ▶





## రాష్ట్రానికి రానున్న మోదీ..

- రెండు రోజుల పర్యటనకు షెడ్యూల్ ఖరారు
- మార్చి 4, 5 తేదీల్లో ఆదిలాబాద్, సంగారెడ్డిలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- అక్కడే బహిరంగ సభల్లో ప్రసంగం
- 4న రాత్రి హైదరాబాద్‌లో బస
- తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శంఖారావం

- వివరాలు 2లో






## చందాదారుల ఆస్తులు కొల్లగొడుతున్న గజదొంగ రామోజీ

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఓ బందిపోటు సంస్థ
- పేదలు, మధ్యతరగతి వర్గాలను వేధిస్తోంది
- కాల్‌మనీ రాకెట్‌లా ఇళ్లపై దాడులు చేస్తోంది
- చిట్టీల ఉచ్చులో బిగించి ఆస్తులు గుంజుకుంటోంది
- రామోజీ అక్రమాలకు వ్యతిరేకంగా సమష్టి పోరు
- మార్గదర్శి చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం స్పష్టీకరణ
- విజయవాడలో బాధితుల సమావేశం.. పెద్ద ఎత్తున తరలివచ్చిన చందాదారులు

- వివరాలు 14లో

## రెండు ప్రమాదాల్లో 8 మంది మృతి

- సూర్యాపేట జిల్లాలో ఆటోను ఢీకొట్టిన బస్సు.. ఐదుగురు మృతి
- సిద్దిపేట జిల్లాలో కారు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురి దుర్మరణం - 5లో

## బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనకు తేడా లేదు

- రెండు పార్టీలూ అవినీతి, కుటుంబ పాలన పార్టీలే
- వారు దోచుకున్నారు.. వీరూ దానికే సిద్ధం
- పాకిస్తాన్‌ను ఏకాకిని చేసింది మోదీనే..
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- వివరాలు 3లో




## క్లుప్తంగా...

### ఎమ్మెల్సీ కవిత పిటిషన్‌పై విచారణ వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు రెండు వారాలు వాయిదా వేసింది. ఈడీ సమన్లు రద్దు చేయాలంటూ కవిత దాఖలు చేసిన పిటిషన్‌ బుధవారం జస్టిస్‌ బేలా ఎం త్రివేది, జస్టిస్‌ పంకజ్‌ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. ఇతర కేసుల విచారణతో కోర్టు సమయం ముగియడంతో కవిత తరపు సీనియర్‌ న్యాయవాది కపిల్‌ సిబల్‌.. పిటిషన్‌ గురించి ధర్మాసనం ముందు ప్రస్తావించారు. దీంతో, రెండు వారాల తర్వాత విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

### మే1 నుంచి నిరవధిక సమ్మె

**ఎన్‌ఎఫ్‌ఐఆర్‌ జాతీయ కార్యదర్శి రాఘవయ్య**

సాక్షి, న్యూఢిల్లీ: నూతన పింఛన్‌ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్‌ విధానాన్ని కొనసాగించాలనే డిమాండ్‌తో మే 1 నుంచి నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు నేషనల్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియన్‌ రైల్వేస్‌ (ఎన్‌ఎఫ్‌ఐఆర్‌) జాతీయ కార్యదర్శి మర్రి రాఘవయ్య తెలిపారు. ఈ మేరకు మార్చి 19న అన్ని జోన్లలోని జనరల్‌ మేనేజర్‌లకు సమ్మె నోటీసులు అందిస్తామని పేర్కొన్నారు.

### రిజర్వేషన్ల తొలగింపునకు కేంద్రం కుట్ర

**మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య**




సాక్షి, హైదరాబాద్‌: దళిత, గిరిజన రిజర్వేషన్ల తొలగింపునకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆరోపించారు. జాతీయ ఎస్సీ కమిషన్‌ ఉన్నప్పటికీ ఎస్సీ వర్గీకరణ అంటూ కేబినెట్‌ కార్యదర్శుల కమిటీ ఏర్పాటుతోనే బీజేపీ ఆలోచన బహిర్గతమైందన్నారు. ఇందుకు తగిన గుణపాఠాన్ని బీజేపీకి చెప్పాలని, తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కకుండా చేయాలని దళిత, గిరిజనులకు ఆయన పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని సికింద్రాబాద్‌లో ఓడిస్తామని, అవసరమైతే కాంగ్రెస్‌కు మద్దతిస్తామన్నారు.

### రాష్ట్ర సహకార బ్యాంక్‌లో మిజోరం బృందం

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్‌ను మిజోరం రాష్ట్ర సహకార బ్యాంక్‌ ఉన్నతాధికారుల బృందం బుధవారం హైదరాబాద్‌లో సందర్శించింది. ఈ సందర్భంగా సహకార వ్యవస్థలో సాధించిన పురోగతిపై చర్చించారు. వ్యాపారాభివృద్ధి, బ్యాంక్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైబర్‌ సెక్యూరిటీ ఆపరేషన్స్‌ సెంటర్, డీల్‌ రూమ్, సీసీటీవీ సర్వైవ్‌లెన్స్‌ రూమ్‌ను సందర్శించారు. సమావేశంలో మిజోరం రాష్ట్ర సహకార అధికార ప్రతినిధుల బృందం, టెస్కాబ్‌ ఎండీ మురళీధర్, అసిస్టెంట్‌ జనరల్‌ మేనేజర్‌ అనుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### బయో ఆసియా సదస్సులో ఒప్పందాలు


సాక్షి, హైదరాబాద్‌: బయో ఆసియా సదస్సు 2024లో భాగంగా చివరి రోజు తెలంగాణ సెంటర్‌ ఫర్‌ ఇండస్ట్రియల్‌ రివల్యూషన్‌ (సీ4ఐఆర్‌) నాలుగు కీలక ఎంఓయూలను కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ఆరోగ్యం, సాంకేతికత, నైపుణ్య శిక్షణలో రాష్ట్రాన్ని సహజ గమ్యస్థానంగా తీర్చిదిద్దడంపై సీ4ఐఆర్‌ కృషి చేస్తుంది. మెరుగైన రోగ నిర్ధారణ, చికిత్సలో ఏఐ సాంకేతికత సమ్మిళితంగా సాగుతున్న ప్రయత్నాల్లో సీ4ఐఆర్‌ భాగస్వామ్యం వహిస్తుంది. పరిశోధనల్లో భాగంగా క్లినికల్, సెన్సర్‌ డేటాను ఉపయోగించి సీ4ఐఆర్‌ అధ్యయనాలు చేస్తుంది. సీ4ఐఆర్‌కు అవసరమైన వేదిక ఏర్పాటుకు ఏఐ సాంకేతిక సాయంతో ఆధునిక ఆరోగ్య పరిష్కారాలను అందజేస్తుంది.




# రాష్ట్రానికి ప్రధాని మోదీ

**తెలంగాణలో ఎన్నికల ప్రచారానికి శంఖారావం**

- రెండు రోజుల పర్యటనకు షెడ్యూల్‌ ఖరారు
- మార్చి 4, 5 తేదీల్లో ఆదిలాబాద్, సంగారెడ్డిలలో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 4న రాత్రి హైదరాబాద్‌లో బస



సాక్షి, హైదరాబాద్‌/సాక్షి, ఆదిలాబాద్‌: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన ఖరారైంది. మార్చి 4, 5 తేదీల్లో ఆయన రాష్ట్రంలో పర్యటించనున్నారు. మార్చి రెండో వారంలోగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ రావొచ్చనే అంచనాల మధ్య ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్‌ జిల్లాల పరిధిలో ఏర్పాటు చేసే వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఆదిలాబాద్, సంగారెడ్డిలలో నిర్వహించే బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పార్లమెంట్‌ ఎన్నికల ప్రచారానికి మోదీ శంఖం పూరించనున్నారు. తమ ప్రభుత్వ అభివృద్ధి నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లపై మోదీ రాజకీయ విమర్శలు సంధిస్తారని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా అక్టోబర్‌ 1, 3 తేదీల్లో మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రారంభంతోపాటు సభల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. మళ్లీ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర పర్యటనకు వస్తున్న మోదీ 4వ తేదీన రాత్రి రాజ్‌భవన్‌లో బసచేస్తారు.

**ఇదీ మోదీ పర్యటన షెడ్యూల్‌...**

- 4న ఉదయం మహారాష్ట్ర నాగ్‌పూర్‌ ఎయిర్‌పోర్టులో ఎంఐ–17 హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 10.20కు ఆదిలాబాద్‌కు చేరు కుంటారు.
- 10.30 నుంచి 11 గంటలదాకా ఆదిలాబాద్‌లో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు
- 11.15 నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా బహిరంగసభలో పాల్గొంటారు
- 12.15కు ఆదిలాబాద్‌ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.10 గంటలకు మహారాష్ట్రలోని నాందేడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి మధ్యాహ్నం 2.45 గంటలకు చెన్నైకి చేరుకుంటారు. అక్కడ వివిధ కార్యక్రమాల్లో పాల్గొని చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి రాత్రి 7.45 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 8 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకుని అక్కడే బసచేస్తారు.
- మార్చి 5న ఉదయం 10,15 గంటలకు హెలికాప్టర్‌లో బేగంపేట నుంచి బయలుదేరి 10.40 గంటలకు సంగారెడ్డికి చేరుకుంటారు
- 10.45 నుంచి 11.15 గంటల దాకా వివిధ అభివృద్ధి ప్రాజెక్ట్‌లు, పనులకు శంకుస్థాపనలు/ప్రారంభోత్సవాలు చేస్తారు.
- 11.25 గంటలకు సంగారెడ్డికి చేరుకుంటారు. 12.15 వరకు సభలో ప్రసంగిస్తారు.
- 12.30కు హెలికాప్టర్‌లో సంగారెడ్డి నుంచి బయలుదేరి 12.55కు బేగంపేటకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం ఒంటిగంటకు బేగంపేట నుంచి విమానంలో భువనేశ్వర్‌కు బయల్దేరుతారు. దీంతో మోదీ రాష్ట్ర పర్యటన పూర్తవుతుంది.

# మెగా హెచ్‌ఎండీఏ!

▶ మొదటి పేజీ తరువాయి




ఆదేశించారు. హెచ్‌ఎండీఏ నుంచి పూర్తి నివేదిక అందిన తర్వాత కేబినెట్లో చర్చించి, టెండర్ల వ్యవహారంపై సీబీఐ లేదా అదే స్థాయి దర్యాప్తు సంస్థతో విచారణ జరిపిస్తామని సీఎం స్పష్టం చేశారు.

**టెండర్‌ విధానంతో రూ.15 వేల కోట్లకు పైగా నష్టం!**

టెండర్లకు ముందు ఓఆర్‌ఆర్‌పై టోల్‌ కింద ఏడాదికి రూ.600 కోట్ల ఆదాయం వచ్చేదని అధికారులు సీఎంకు వివరించారు. అలాంటప్పుడు 30 ఏళ్లకు రూ.18 వేల కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని కానీ కేవలం రూ.7,380 కోట్లకు ఐఆర్‌బీ కంపెనీకి ఎలా అప్పగించారని రేవంత్‌ ప్రశ్నించారు. హెచ్‌ఎండీఏ అనుసరించిన టెండర్‌ విధానంతో ప్రభుత్వం రూ.15 వేల కోట్లకు పైగా నష్టపోయిందని సమావేశంలో ప్రాథమికంగా అంచనా వేశారు. హెచ్‌ఎండీఏ రెండు కంపెనీలతో డీపీఆర్‌ తయారు చేయించగా, ప్రభుత్వ ఆదాయానికి నష్టం తెచ్చే డీపీఆర్‌ను ఎంచుకున్నారనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయిస్తేనే నిజాలు బయటకు వస్తాయని సీఎం పేర్కొన్నారు. టెండర్‌ దక్కించుకున్న కంపెనీ ప్రభుత్వంతో చేసుకున్న కాంట్రాక్టు అగ్రిమెంట్‌ను చూపించి 49% వాటాను విదేశీ కంపెనీలకు అప్పగించిందని, విదేశీ కంపెనీలతో ఆ సంస్థ చేసుకున్న లావాదేవీలపై కూడా దర్యాప్తు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

**చెరువులు, కుంటల్ని పరిరక్షించాలి**

హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటలను పరిరక్షించాలని, అలాగే ల్యాండ్‌ పూలింగ్‌ను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. హెచ్‌ఎండీఏ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, డిజిటల్, జీపీఎస్‌ విధానాలతో ఎక్కడ ఎంత స్థలముందో మ్యాపింగ్‌ చేయాలని ఆదేశించారు. ల్యాండ్‌ పార్శిల్స్, చెరువులు, కుంటలు ఆక్రమణకు గురి కాకుండా ప్రత్యేక అధికారులను నియమించాలని చెప్పారు. డీఐజీ స్థాయిలో ఒక ఐపీఎస్‌ అధికారిని నియమించాలని, ఇద్దరు ఎస్పీ ర్యాంకు అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. కాగా హెచ్‌ఎండీఏ పరిధిలో దాదాపు 8,374 ఎకరాల ల్యాండ్‌ పార్శిళ్లు ఉంటే.. అందులో 2,031 ఎకరాల పార్శిళ్లు వివిధ స్థాయిల్లో కోర్టు కేసుల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు.

**'కమ్యూనిటీ' స్థలాలపై తక్షణ సర్వే**

హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్‌ తదితర పట్టణాల లే అవుట్లలో కమ్యూనిటీ అవసరాలకు ఇచ్చిన స్థలాలు తమ అధీనంలోనే ఉన్నాయా? లేక ఆక్రమణకు గురయ్యాయా? వెంటనే సర్వే చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ స్థలాల్లో ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాఠశాలల ఏర్పాటుకు ముందుకొచ్చే కార్పొరేట్‌ కంపెనీలు, పేరొందిన పాఠశాలల యాజమాన్యాలకు వీటిని అప్పగించాలని సూచించారు. స్థానికులైన పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు ఉచితంగా కనీసం 25 శాతం అడ్మిషన్లు ఇవ్వాలని చెప్పారు.

**ప్రపంచ స్థాయి టూరిస్ట్‌ ప్లేస్‌గా హుస్సేన్‌సాగర్‌ పరిసరాలు**

హుస్సేన్‌సాగర్‌ పరిసర ప్రాంతాలను ఆహ్లాదకరమైన, అందమైన జోన్‌గా తీర్చిదిద్దాలని సీఎం అధికారులకు ఆదేశించారు. అంబేడ్కర్‌ విగ్రహం, ఎన్టీఆర్‌ పార్కు, తెలంగాణ అమరుల జ్యోతి నుంచి అటు నెక్లెస్‌ రోడ్డు, ఇందిరా పార్కు, సంజీవయ్య పార్కు వరకు ఉన్న మొత్తం ప్రాంతాన్ని ప్రపంచస్థాయి సందర్శనీయ ప్రాంగణంగా తయారు చేయాలని సూచించారు. హుస్సేన్‌సాగర్‌ చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలిగించాలన్నారు. దుబాయ్‌ తరహాలో స్కై వాక్‌ వే, ఫుడ్‌ స్టాళ్లు, చిల్డ్రన్‌ అమ్యూజ్మెంట్‌ జోన్, గ్రీనరీ, ల్యాండ్‌ స్కేప్‌లను అభివృద్ధి చేయాలని సూచించారు. అవసరమైతే ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలను మరో రూట్‌కు మళ్లించి పర్యాటక జోన్‌గా మార్చాలని చెప్పారు. అంతర్జాతీయ స్థాయి కన్సల్టెన్సీలతో ఈ ప్రాజెక్టు నమూనాలు తయారు చేయాలని ఆదేశించారు. సీఎస్‌ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌ రెడ్డి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, ఆర్‌ అండ్‌ బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, హెచ్‌ఎండీఏ జాయింట్‌ కమిషనర్‌ ఆమ్రపాలి సమీక్షలో పాల్గొన్నారు.

# ఎంపీ టికెట్‌ ఎవరికో?

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతోంది. మల్కాజ్‌గిరి సీటు కోసం దేవేందర్‌గౌడ్‌ తనయుడు వీరేందర్‌గౌడ్‌ పేరు కూడా వినిపిస్తోంది. ఆయన త్వరలోనే పార్టీలోకి వస్తున్నారని, ఆయనతో పాటు సినీ నిర్మాత బండ్లగణేశ్, కొందరు ఇతర నాయకుల పేర్లను పరిశీలిస్తారని అంటున్నారు. ఇక, మెదక్‌ విషయంలో మైనంపల్లి హనుమంతరావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనతో పాటు వైద్య మంత్రి దామోదర రాజనర్సింహ కుమార్తె త్రిష కూడా రేసులో ఉండడం గమనార్హం. వరంగల్‌ విషయానికి వస్తే అక్కడ పోటీ తీవ్రంగా ఉంది. ఇక్కడి నుంచి తాటికొండ రాజయ్యతో పాటు జిల్లా రిజిస్ట్రార్‌ హరికోట్ల రవి, దొమ్మాటి సాంబయ్య, సింగాపురం ఇందిర, అద్దంకి దయాకర్, డాక్టర్‌. ఆర్‌. పరమేశ్వర్‌ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే నాగర్‌కర్నూల్, పెద్దపల్లి లోక్‌సభ స్థానాలను ఏ సామాజిక వర్గానికి ఇస్తారన్న దాన్ని బట్టి వరంగల్‌లో అభ్యర్థి ఖరారయ్యే అవకాశాలున్నాయి. నాగర్‌కర్నూల్‌ నుంచి టీపీసీసీ సీనియర్‌ ఉపాధ్యక్షుడు మల్లురవి పేరు దాదాపు ఖరారైందని తెలుస్తోంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, డాక్టర్‌ చారగొండ వెంకటేశ్‌ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. పెద్దపల్లి నుంచి గడ్డం వివేక్‌ కుమారుడు వంశీ, సిట్టింగ్‌ ఎంపీ వెంకటేశ్‌ నేతకాని, పెర్క శ్యాం కుమార్‌లో ఒకరికి అవకాశం దక్కే చాన్సుంది.

**రాహుల్‌ వచ్చేనా?**

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పోటీ చేస్తారనే అంశంపై గాంధీభవన్‌ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కేరళలోని వాయనాడ్‌ స్థానంలో ఇండియా కూటమి నుంచి సీపీఐ పోటీ చేస్తుందన్న వార్తల నేపథ్యంలో రాహుల్‌గాంధీ కర్ణాటక లేదా తెలంగాణ నుంచి బరిలో ఉంటారని తెలుస్తోంది. గతంలో కూడా సోనియా, ప్రియాంకాగాంధీ తెలంగాణలో పోటీ చేస్తారని, సోనియాగాంధీని తెలంగాణ నుంచే రాజ్యసభకు ఎంపిక చేస్తారనే వార్తలు వినిపించాయి. ఇప్పుడు తాజాగా రాహుల్‌ పేరు తెరపైకి రావడం గమనార్హం. ఒకవేళ ఆయన తెలంగాణ నుంచి పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంటే ఖమ్మం లేదా నల్లగొండ లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

**ఐదు రిజర్వుడు, మూడు బీసీ, ఒకటి మైనార్టీకి**

రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో మూడు ఎస్సీలకు, రెండు ఎస్టీలకు రిజర్వు అయ్యాయి. ఇవి పోను మిగిలిన 12 స్థానాల్లో మూడు స్థానాలను బీసీలకు ఇస్తారని, ఒక్క స్థానాన్ని మైనార్టీలకు కేటాయిస్తారని గాంధీభవన్‌ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మిగిలిన 8 చోట్ల జనరల్‌ అభ్యర్థులు పోటీ చేయనున్నట్టు సమాచారం. బీసీలకిచ్చే స్థానాల్లో మెదక్, జహీరాబాద్, సికింద్రాబాద్‌ ఉంటాయని తెలుస్తోంది. హైదరాబాద్‌ లోక్‌సభకు మైనార్టీ నేతను పోటీ చేయిస్తారని, హైదరాబాద్‌ జిల్లా పార్టీ అధ్యక్షుడు సమీర్‌వలిఉల్లాకు సీటు దక్కే అవకాశం ఉందని సమాచారం. ఈయనతో పాటు ఫిరోజ్‌ఖాన్, అలీ మస్కతి లాంటి సీనియర్ల పేర్లు కూడా మొదటి నుంచీ ప్రచారంలో ఉన్నాయి. మిగిలిన స్థానాల విషయానికి వస్తే వంశీచందర్‌రెడ్డి (మహబూబ్‌నగర్), పటేల్‌ రమేశ్‌రెడ్డి, జానారెడ్డి (నల్లగొండ), చామల కిరణ్‌రెడ్డి, కుంభం కీర్తిరెడ్డి, కోమటిరెడ్డి లక్ష్మి, కోమటిరెడ్డి పవన్‌రెడ్డి, కొమ్మూరి ప్రతాపరెడ్డి, పున్నా కైలాశ్‌నేత, చనగోని దయాకర్‌ (భువనగిరి), సురేశ్‌షెట్కార్‌ (జహీరాబాద్), వీహెచ్, జెట్టి కుసుమకుమార్, పొంగులేటి ప్రసాదరెడ్డి, మల్లునందిని, వి.వి.రాజేంద్రప్రసాద్‌ (ఖమ్మం), పెద్దిరెడ్డి, అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, రుద్ర సంతోశ్‌ (కరీంనగర్), టి.జీవన్‌రెడ్డి, ముత్యాల సునీల్‌రెడ్డి, ఈరవత్రి అనిల్‌ (నిజామాబాద్), బలరాం నాయక్, బెల్లయ్య నాయక్, డాక్టర్‌. శంకర్‌నాయక్, విజయాబాయి (మహబూబాబాద్), నరేశ్‌ జాదవ్, రేఖానాయక్‌ (ఆదిలాబాద్) పేర్లు వినిపిస్తున్నాయి.

# లైఫ్‌ సైన్సెస్‌ హబ్‌గా హైదరాబాద్‌

- ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచస్థాయి కంపెనీల ఆసక్తి
- బయో ఆసియా సదస్సులో ఎలి లిల్లీ సీఈవో డేవిడ్‌ రిక్స్‌

సాక్షి, హైదరాబాద్‌: 'లైఫ్‌సైన్సెస్‌ రంగంలో ఏళ్ల తరబడి సాగుతున్న కృషి ఫలితంగానే కేవలం భారత్‌లోనే కాకుండా అంతర్జాతీయంగా హైదరాబాద్‌ 'లైఫ్‌సైన్సెస్‌ హబ్‌'గా గుర్తింపు పొందింది. ప్రపంచస్థాయి మౌలిక వసతులు, ప్రగతిశీల విధానాల ద్వారా ప్రపంచంలోనే తయారీ, లైఫ్‌సైన్సెస్‌ రంగంలో ఉద్యోగాలకు చిరునామాగా నిలిచింది. ప్రపంచ లైఫ్‌సైన్సెస్‌ రంగంలో తన స్థానాన్ని పదిలపరుచుకునేందుకు 2047 ప్రణాళికతో భారత్‌ అనేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌లోని బలమైన పారిశ్రామిక వాతావరణం, స్థిరమైన ప్రభుత్వం, అనుకూల విధానాలతో ప్రపంచ స్థాయి కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి'అని ఎలి లిల్లీ సీఈవో డేవిడ్‌ రిక్స్‌ పేర్కొన్నారు. నగరంలో జరుగుతున్న బయో ఆసియా సదస్సు 2024 చివరి రోజు సమావేశాల్లో భాగంగా రిక్స్‌ కీలకోపన్యాసం చేశారు.

''దేశీయ ఆవిష్కరణలను ప్రపంచీకరణ చేయడంలో భారతీయ కంపెనీలు ముందుకు రాకపోవడం అతిపెద్ద లోపం. భారత్‌లో ప్రస్తుతం డయాబెటిస్‌ అతిపెద్ద సమస్య కాగా ఈ విషయంలో త్వరలో చైనాను కూడా అధిగమించబోతోంది. మరోవైపు భారత్‌లో ఆరోగ్య బీమా అనేది ప్రాథమిక స్థాయిలోనే ఉంది. అయితే భారత్‌లో నైపుణ్యానికి కొదవలేదు'అని డేవిడ్‌ రిక్స్‌ పేర్కొన్నారు.

**కొత్త చికిత్స విధానాలు: జెఫ్‌ మార్తా**

'సాంకేతిక పురోగతి సాధించిన కొద్దీ నూతన చికిత్సా విధానాలకు ద్వారాలు తెరుచుకుంటున్నాయి. దీంతో ఆరోగ్య రక్షణ రంగంలో 'మెడ్‌టెక్‌'(వైద్య సాంకేతికత)కు ప్రాధాన్యత పెరిగింది. దీంతో చికిత్సలో మెషీన్‌ లెర్నింగ్‌ (ఎంఎల్), డీప్‌ లెర్నింగ్‌ (డీఎల్) సాంకేతిక ఆధారిత ఉపకరణాల వినియోగం పెరగడంతో పాటు ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ) సాంకేతికత ప్రాధాన్యత కూడా పెరుగుతోంది'అని మెడ్‌ట్రానిక్స్‌ చైర్మన్, సీఈఓ జెఫ్‌ మార్తా పేర్కొన్నారు. 'డేటా, ఏఐ, క్లౌడ్‌ కంప్యూటింగ్, 5జీ, 10జీ రోబోటిక్స్‌ వంటివి వైద్య ఉపకరణాల తయారీ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యతను సంతరించుకుంటున్నాయి. సర్జికల్‌ రోబోటిక్స్‌ విధానంలో అమెరికాలో 20 శాతం, ప్రపంచ వ్యాప్తంగా 5శాతం సర్జరీలు జరుగుతుండగా, భారత్‌లో మాత్రం ఇంకా ప్రాథమిక స్థాయిలోనే ఉంది. రోబోటిక్‌ సర్జరీల కోసం వైద్యులకు అత్యున్నత శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడుతోంది''అని జెఫ్‌ మార్తా వ్యాఖ్యానించారు.

# నేడు కొత్త డీఎస్సీ నోటిఫికేషన్‌!

- పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసిన పాఠశాల విద్యాశాఖ
- 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్‌: గతంలో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు పాఠశాల విద్య కమిషనర్‌ దేవసేన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త నోటిఫికేషన్‌ గురువారం వెలువడే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది సెప్టెంబర్‌ 6వ తేదీన 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి డీఎస్సీ నోటిఫికేషన్‌ వెలువడింది. ఈ పోస్టులకు దాదాపు 1.75 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే పరీక్షను నిర్వహించాలనుకున్న తేదీల్లోనే అసెంబ్లీ ఎన్నికల తేదీలు రావడంతో డీఎస్సీ పరీక్షను వాయిదా వేశారు. కాగా కొత్త ప్రభుత్వం 11,062 పోస్టుల భర్తీ చేపట్టాలని నిర్ణయించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. గత డీఎస్సీ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులు తిరిగి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని బుధవారం నాటి ప్రకటనలో స్పష్టం చేసింది.

# ఐఐటీ హైదరాబాద్‌కు 'గోదావరి' బాధ్యత

- బేసిన్‌ నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేయనున్న సంస్థ
- పలు ప్రాజెక్టులకు ప్రతిష్టాత్మక విద్యా సంస్థలతో కేంద్ర జలశక్తి శాఖ ఒప్పందం

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి, కృష్ణా నది సహా ఆరు నదుల బేసిన్‌ నిర్వహణ ప్రణాళికను సిద్ధం చేసే పనిని కేంద్ర జలశక్తి శాఖ పలు విద్యా సంస్థలకు అప్పగించింది. గోదావరి బేసిన్‌ నిర్వహణ ప్రణాళిక బాధ్యతను ఐఐటీ హైదరాబాద్, ఎన్‌ఈఈఆర్‌ఐ నాగ్‌పూర్‌కు అప్పగించింది. కృష్ణా నదీ బేసిన్‌ నిర్వహణ ప్రణాళిక బాధ్యతను ఎన్‌ఐటీ వరంగల్, ఎన్‌ఐటీ సూరత్‌కల్‌కు అప్పగించింది. ఇలా దేశంలోని 6 ప్రధాన నదులు నర్మదా, గోదావరి, కృష్ణా, కావేరి, పెరియార్, మహానది బేసిన్‌ నిర్వహణ ప్రణాళికను రూపొందించే బాధ్యతను 12 సాంకేతిక సంస్థలు తీసుకోనున్నాయి. ఈ మేరకు బుధవారం 12 విద్యా సంస్థలు, నేషనల్‌ రివర్‌ కన్జర్వేషన్‌ డైరెక్టరేట్, జలశక్తి మంత్రిత్వ శాఖ మధ్య ఒప్పందం కుదిరింది. ఢిల్లీలోని డాక్టర్‌ అంబేడ్కర్‌ ఇంటర్నేషనల్‌ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్‌ షెకావత్, శాఖ సహాయ మంత్రులు రాజీవ్‌ చంద్రశేఖర్, బిశ్వేశ్వర్‌ తుడులతో పాటు 12 విద్యాసంస్థల డైరెక్టర్లు హాజరయ్యారు. ఇప్పటికే దేశంలోని అతిపెద్ద నది అయిన గంగా బేసిన్‌ నిర్వహణ ప్రణాళికను ఐఐటీ కాన్పూర్‌ నేతృత్వంలోని ఏడు ఐఐటీల కన్సార్టియం విజయవంతంగా పూర్తి చేసిందని జలశక్తి శాఖ ప్రకటించింది.

# క్రిష్‌ విచారణ ఎప్పుడు?

**ముంబైలో ఉన్నారంటున్న పోలీసులు.. రేపు విచారణకు రావొచ్చని అంచనా**



గచ్చిబౌలి: రాడిసన్‌ బ్లూ హోటల్‌ డ్రగ్‌ కేసులో అనుమానితునిగా ఉన్న తెలుగు సినీ డైరెక్టర్‌ జాగర్లమూడి క్రిష్‌ విచారణ ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. క్రిష్‌ ఫోన్‌ స్విచ్చాఫ్‌లో ఉందని, ముంబైలో ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. అయినప్పటికీ క్రిష్‌ శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం ఉందని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. అనుమానితునిగా ఉన్న క్రిష్‌ పోలీసుల ఎదుట హాజరయ్యేందుకు జాప్యానికి గల కారణాలను అధికారులు వెల్లడించడం లేదు. ఈ కేసులో ఇప్పటివరకు నలుగురు నిందితులను అరెస్ట్‌ చేశారు. పరారీలో ఉన్న రఘు చరణ్, సందీప్, లిషీ, శ్వేత, నీల్‌ కోసం పోలీసు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. రాడిసన్‌ హోటల్‌లో గత శనివారం డ్రగ్‌ పార్టీ నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు గజ్జల వివేకానంద పార్టీ ముగిసే వరకు హోటల్‌ గదిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. రఘు చరణ్, నీల్‌తో కలిసి వచ్చిన డైరెక్టర్‌ క్రిష్‌ నేరుగా వివేకానంద ఉన్న గదిలోకి వెళ్లి 30 నిమిషాల పాటు గడిపినట్లు పోలీసులు గుర్తించారు. కేదార్, లిషీ, నిర్భయ్‌ కలిసి రాడిసన్‌ హోటల్‌కు వెళ్లారు. సందీప్, శ్వేత రాడిసన్‌కు వచ్చారు. రాత్రి 8.30 గంటలకు పార్టీ ముగించుకొని వెళ్లగా పోలీసులు రాత్రి 12.30 గంటలకు హోటల్‌కు చేరుకున్నారు. అప్పటికే డ్రగ్‌ పార్టీ ముగించుకొని అక్కడి నుంచి అందరూ ఉడాయించారు.

**సీసీ కెమెరాలపై అనుమానాలెన్నో**

స్టార్‌ హోటల్‌గా గుర్తింపు ఉన్న రాడిసన్‌ హోటల్‌లో సీసీ కెమెరాల నిర్వహణ అధ్వానంగా ఉండటం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. హోటల్‌లో మొత్తం 209 కెమెరాలు ఉండగా కేవలం 16 సీసీ కెమెరాలు మాత్రమే పని చేస్తున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. డ్రగ్‌ పార్టీ జరిగిన రూమ్‌ వైపు ఉన్న కెమెరాలు పని చేయకపోవడం గమనార్హం. కావాలనే సీసీ కెమెరాలు పని చేయకుండా చేశారా అనే అనుమానాలు నెలకొన్నాయి.

# సాంకేతికతతో చౌక వైద్య సేవలు

**గ్రామీణులకు వైద్య పరీక్షలను మరింత చేరువలోకి తేవాలి**

- బయో ఆసియా ముగింపు సదస్సులో గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌



సాక్షి, హైదరాబాద్‌: సాంకేతిక పరిజ్ఞానంతో పేదలకు తక్కువ ధరకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ అన్నారు. గ్రామీణ పేదలకు వైద్య పరీక్షలను మరింత చేరువలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బుధవారం బయో ఆసియా–2024 ముగింపు సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. తాను గవర్నర్‌గా మాత్రమే కాకుండా డాక్టర్‌గా కూడా ఉన్నానన్నారు. ఏ అభివృద్ధి జరిగినా అది పేదలకు ఉపయోగపడాలని చెప్పారు. గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న క్లిష్టమైన సమస్య అల్ట్రాసౌండ్‌ స్కానింగ్‌ చేయించుకోవడమని అన్నారు. తాను డాక్టర్‌గా పనిచేసిన సమయంలో అల్ట్రాసౌండ్‌ అందుబాటులో లేకపోవడం వల్ల అనేకమంది ఇబ్బంది పడిన సందర్భాలను చూసినట్లు చెప్పారు. అల్ట్రాసౌండ్‌ స్కానింగ్‌కు ఎక్కువ ధర ఉండటమే అందుకు కారణమన్నారు. అల్ట్రాసౌండ్‌లో స్టార్టప్‌ ద్వారా కొత్త రోబోటిక్‌ అందుబాటులోకి వచ్చినందుకు ఆమె సంతోషం వ్యక్తంచేశారు. సరసమైన ధరలో అల్ట్రాసౌండ్, వ్యాక్సిన్ల వంటి ఆవిష్కరణలను ప్రోత్సహించినందుకు బయో ఆసియాను అభినందించారు. ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ ప్రారంభమైన తర్వాత రొమ్ము కేన్సర్‌ మునుపటి కంటే 20 రెట్లు ఎక్కువగా నిర్ధారణ అవుతోందన్నారు. చికిత్సకంటే రోగ నిర్ధారణ చాలా ముఖ్యమైందన్నారు. కానీ చికిత్స విషయానికి వస్తే ఖర్చుతో కూడుకోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని గవర్నర్‌ పేర్కొన్నారు.

**ఐదు స్టార్టప్‌లకు అవార్డులు**

ఐదు స్టార్టప్‌ కంపెనీలకు బయో ఆసియా అవార్డులు ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయా కంపెనీల ప్రతినిధులకు గవర్నర్‌ తమిళిసై అవార్డులు ప్రదానం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి (యూఆర్‌ అడ్వ్‌ థెరప్యూటిక్), విశాల్‌ గుప్తా (డిజైన్), వైభవ్‌ భాటియా (లామార్క్), డాక్టర్‌ కృష్ణ ప్రసాద్‌ (ప్లెబిక్‌ ఇన్నోవేషన్స్), రావు కోటుపోలు (జెడ్‌బ్లాక్స్‌ లాజిటెక్‌)లు ఈ పురస్కారాలు అందుకున్నారు.

# గ్రామీణ ప్రాంతాలకూ ఆరోగ్య రక్షణ

**జీవశాస్త్ర పరిశోధన, తయారీ రంగాల్లో నైపుణ్య శిక్షణ: మంత్రి శ్రీధర్‌బాబు**




బయో ఆసియా సదస్సులో డబ్ల్యూఈఎఫ్‌ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్‌: 'రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తున్నా గ్రామీణ ప్రాంతాల ప్రజలు నాణ్యమైన ఆరోగ్య రక్షణకు చేరువ కావడం అతిపెద్ద సవాలుగా మారింది. చాలామంది తమకు అవసరమైన వైద్య సేవలను అందుకోలేకపోతున్నారు. భౌగోళికతతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరికి ఆరోగ్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు అందరిపైనా సమష్టి బాధ్యత ఉంది. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని జీవితాలను ప్రభావితం చేసేలా ఆరోగ్య రక్షణ, లైఫ్‌ సైన్సెస్‌ రంగాల్లో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో వైద్య సేవల రంగాన్ని విస్తరించాల్సి ఉంది'అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌ బాబు అన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్), తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటైన నాలుగో పారిశ్రామిక విప్లవ కేంద్రం (సీ4ఐఆర్)ను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఆరోగ్యరక్షణ, ఆరోగ్య సాంకేతికతలో సమాజ శ్రేయస్సు లక్ష్యంగా 'సీ4ఐఆర్'ను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

**మౌలిక వసతులకే పరిమితం కాబోము**

'భారతీయ ఫార్మారంగ ఉత్పత్తిలో 40 శాతం తెలంగాణలోనే జరుగుతోంది. ప్రపంచ వ్యాక్సిన్‌ ఉత్పత్తుల్లో ఏటా 14 బిలియన్ల డోసులు అనగా.. మూడొంతులు ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నాయి. రాష్ట్రంలో కేవలం మౌలిక వసతుల కల్పనకే పరిమితం కాకుండా ఉపాధి అవకాశాల సృష్టి, నైపుణ్య శిక్షణ, అంతర్జాతీయ నైపుణ్యాన్ని ఆకర్షించడం ద్వారా 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పనిచేస్తాం. సీ4ఐఆర్‌తో భాగస్వామ్యం ద్వారా జీవనోపాధి పెంపుదలకు అవసరమైన నైపుణ్య శిక్షణ, హెల్త్‌ ప్రొఫైల్‌ తయారీ, వినూత్న క్లినికల్‌ అధ్యయనాల ద్వారా శరవేగంగా మార్కెట్‌లోకి చికిత్స విధానాలు తెచ్చే దిశగా పనిచేస్తాం. తద్వారా భారత్‌లో నాణ్యమైన ఆరోగ్య రక్షణను కొత్త శిఖరాలకు చేర్చడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య రక్షణ, సామాజిక పరివర్తన సాధిస్తాం. దీనికోసం పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కోర్సులు, ఇంటర్న్‌షిప్‌ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తాం. మానవ వనరుల కోసం వచ్చే ఐదారేళ్లలో 50వేలకు పైగా స్థానిక పట్టభద్రులకు నైపుణ్య శిక్షణ ఇస్తాం. శిక్షణలో భాగంగా వారం రోజుల్లో ప్రయోగాత్మకంగా మెడిసినల్‌ కెమిస్ట్రీ, అనలిటికల్‌ కెమిస్ట్రీలో రెండు ప్రత్యేక కోర్సులు ప్రారంభిస్తాం. పరిశోధన, అభివృద్ధి, తయారీ రంగాలను మినహాయిస్తే ఆరోగ్య సాంకేతిక రంగంలో సీ4ఐఆర్, తెలంగాణ భాగస్వామ్యం.. 10వేలకు పైగా కొత్త ఉద్యోగాల కల్పనకు దోహదం చేస్తుంది. మరో 20 నుంచి 25 ఔత్సాహిక కంపెనీలు, స్టార్టప్‌లకు ఊతమివ్వడంతోపాటు 10 నుంచి 25 వినూత్న ఆలోచనలకు పురుడు పోస్తుంది'అని శ్రీధర్‌ బాబు పేర్కొన్నారు. బయో ఆసియా సదస్సు 2024 వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో వరల్డ్‌ ఎకనామిక్‌ ఫోరం మేనేజింగ్‌ డైరెక్టర్‌ జెరెమీ జెర్గెన్స్, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌ రంజన్‌ తదితరులు పాల్గొన్నారు.